క్లుప్తంగా

5న వెంకన్న ఆలయ ద్వాదశ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వేంకటేశ్వర నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయ 12వ (ద్వాదశ) వార్షిక కల్యాణ మహోత్సవం ఈనెల 5వ తేదీ సాయంత్రం 5 గంటకు జరుగుతుంది. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఖండవిల్లి రాధాకృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు అంగర వల్లీకాంతాచార్యులు, భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం నుంచీ ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నసమారాధన జరుగుతాయి. గాయత్రీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తారు. ఈనెల 4వ తేదీ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి పల్లకీ ఊరేగింపు జరుగుతుందన్నారు.

పోసికుమార్‌కు అభినందనలు



పోసికుమార్‌ను అభినందిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ధవళేశ్వరం: డాక్టరేట్ అందుకున్న వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు, స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌ను రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వైఎస్సార్ సీపీ కేంద్ర పాలకమండలి సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అభినందించారు. స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పోసికుమార్ అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యచంద్రరావు, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా కార్యదర్శి ఆదం పకీర్ పాల్గొన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పోతుల వర్ధంతి

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుల వీరభద్రరావు వర్ధంతి సభ సోమవారం సాయంత్రం 6 గంటలకు శ్రీ కందుకూరి వీరేశలింగం పుర మందిరం (టౌన్ హాల్)లో శ్రీపోతుల వీరభద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సెక్రటరీ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ఎస్‌కేవీటీ డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బిరెడ్డి పేరయ్య నాయుడు (సాహిత్యం), లాయర్ ఘంటా విజయ్ సునీల్ కుమార్ (సేవ), టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు పేరూరు వీర వెంకట సత్యనారాయణరావు (క్రీడలు)లను సత్కరిస్తామన్నారు. కార్యక్రమానికి పోతుల వీరభద్రరావు ట్రస్ట్ అధ్యక్షుడు కళాగౌతమి బులుసు వీఎస్ మూర్తి అధ్యక్షత వహిస్తారని, పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులు



వివిధ రకాల బెల్టులు సాధించిన విద్యార్థులు

కడియం: ఆత్మరక్షణ, శారీరక సామర్థ్యం పెంపొందించే కరాటేలో చిన్నారులు ప్రతిభ చూపారు. జపాన్ షాటోకాన్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కడియపుసావరంలో బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. నేషనల్ ఎగ్జామినర్ డీఎల్ నారాయణ పర్యవేక్షణలో చిన్నారులు తాము నేర్చుకున్న విద్యను ప్రదర్శించి వివిధ రకాల బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లను దక్కించుకున్నారు. కడియానికి చెందిన కోచ్ కె.జానకిరాముడు ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన వంద మంది విద్యార్థులకు ఈ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో సావరం సర్పంచ్ చక్కపల్లి మురళీకృష్ణ, స్థానిక నాయకులు శీలం రవి పాల్గొన్నారు.

క్లాత్ సంచుల వాడకంపై అవగాహన



క్లాత్ సంచులపై అవగాహన కల్పిస్తున్న ట్రస్టు సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిషేధించాలని, క్లాత్ సంచులనే వాడాలని కోరుతూ మన సత్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం వీఎల్ పురం రైతుబజార్ వద్ద వినియోగదారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను, పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను పంపిణీ చేశారు. ప్రముఖ సంఘ సేవకుడు మెహర్ మధు సహకారంతో క్లాత్ సంచులను ఉచితంగా వినియోగదారులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



లాలాచెరువు సమీపంలోని సీడబ్ల్యూసీ సెంటర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



ఈస్టర్ సందర్భంగా జాంపేట ఆజాద్‌చౌక్‌లో పాలు పంపిణీ చేస్తున్న ముస్లిం నాయకుడు హబీబుల్లాఖాన్



సీడబ్ల్యూసీ సెంటర్‌లో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

- చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు
- ఆత్మీయుల సమాధులకు అలంకరణ

సీటీఆర్ఐ: ఈస్టర్ పర్వదినాన్ని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఏసుక్రీస్తు శిలువ మరణం నుంచి లేచిన రోజును పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని సమాధుల తోటలను ముస్తాబు చేశారు. ఆత్మీయులు, బంధు మిత్రుల సమాధులపై కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని లూథరన్ సమాధుల తోటలలోనూ, క్వారీ మార్కెట్ వద్ద గల సమాధులను ఈస్టర్ పండగ సందర్భంగా అందంగా అలంకరించారు

క్రీస్తు బోధనలు ఆచరణీయం

ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గం అందరికీ ఆచరణీయమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. లాలాచెరువులోని సీడబ్ల్యూసీ సెంటర్లో అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ జాన్ వెస్లీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈస్టర్ వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఏసు చూపిన మార్గం ఎంతో పవిత్రం

దేవుని కుమారుడు ఏసుక్రీస్తు మానవాళిని రక్షించేందుకు ఈ భూమి మీదకు వచ్చారని, ఆయన చూపిన పవిత్ర మార్గంలో విశ్వాసులందరూ నడవాలని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 30వ వార్డులోని చర్చిపేట వద్ద గల సెయింట్ పాల్స్ చర్చి, గోకవరం బస్టాండ్ సమీపంలోని హోలీ ట్రినిటీ చర్చి, ఒకటో వార్డు లాలా చెరువు వద్దగల హోసన్నా చర్చి, రాజా థియేటర్ వద్ద గల బ్రదరన్ చర్చిలలో నిర్వహించిన ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఏవీ అప్పారావు రోడ్డు గెయిల్ ఆఫీసు ఎదురుగా ఉన్న ప్రతాప్ సిన్హా చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఎంపీ భరత్ రామ్, ఆయన సతీమణి మోనా పాల్గొన్నారు.



ఏపిఫానియా లూథరన్ చర్చిలో పార్థన చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



ప్రతాప్ సిన్హా చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

మానవాళికి ఆదర్శం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఏసుక్రీస్తు చూపిన మార్గం మానవాళికి ఆదర్శనీయమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక ఐఎల్‌టీడీ జంక్షన్‌లో ఏపీఫానియా లూథరన్ చర్చిలో జరిగిన క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సహనం, త్యాగం, కరుణ, మానవత్వం తదితర సుగుణాలన్నీ మేళవించిన మహానీయుడు ఏసుక్రీస్తు అన్నారు.ఆ ఏపిఫానియా లూథరన్ చర్చి పాస్టర్ శ్యామ్‌బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సక్కా రాజబాబు, అంగాడి సత్యప్రియ, ఎల్‌వీ ప్రసాద్, బాబ్జీ పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: మండలంలోని క్రైస్తవ ఆలయాల్లో ఆదివారం ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో భాగంగా తెల్లవారు జామునే సమాధులను శుభ్రం చేసి, పువ్వులతో అలంకరించారు. కొవ్వొత్తులను వెలిగించిన అనంతరం పెద్దలను గుర్తు చేసుకుని ప్రార్థనలు నిర్వహించారు.

హోం ఓటింగ్‌పై ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా తీసుకునే చర్యలలో భాగంగా హోం ఓటింగ్‌పై ప్రత్యేక కార్యచరణ సిద్ధం చేసుకోవాలని రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ స్పష్టం చేశారు. ఆయన ఆదివారం తన ఛాంబర్‌లో 51 రాజమండ్రి రూరల్ సెక్టార్ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లతో హోం ఓటింగ్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలలో భాగంగా 85 ఏళ్లు నిండిన ఓటర్లు, 40 శాతం పైబడిన దివ్యాంగ ఓటర్లు 12 డి ఫారం ద్వారా అంగీకారం తెలిపిన వారికి ఇంటి వద్దనే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. నియోజక వర్గ పరిధిలోని 267 పోలింగ్ కేంద్రాలలో 85 ఏళ్లు నిండిన 1,191 ఓటర్లు, 40 శాతం పైబడిన దివ్యాంగ ఓటర్లు 2,439 ఉన్నట్లు గుర్తించామన్నారు. వారిలో పోలింగ్ కేంద్రానికి రాలేనివారి కోసం 12 డి ఫారం ద్వారా అంగీకారం పత్రం తీసుకుని, ఆ మేరకు ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో సెక్టార్ అధికారులు, సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

అన్నసమారాధన

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భారీ అన్నసమారాధన జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా నాలుగు రోజులుగా ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించిన విషయం తెలిసిందే. చివరి రోజైన ఆదివారం దాతలు, భక్తుల సహకారంతో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. కడియపులంకతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, అన్నప్రసాదం స్వీకరించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇఫ్తార్ విందులతో మత సామరస్యం



బొమ్మూరు బిలాల్ మసీదులో మంత్రి వేణును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు



రాజేంద్ర నగర్ మసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు నిలుస్తాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని బిలాల్ మసీదులో రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లా చూపిన మార్గంలో ముస్లింలు నడుచుకుంటూ పదిమందికీ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కష్టాల్లో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకోవడం, అందరిపైనా ప్రేమతో మెలగడం, ఉన్నదాంట్లోనే ఇతరులకు సహాయం చేయడం ఇవన్నీ గొప్ప లక్షణాలన్నారు. అనంతరం మంత్రి వేణును మసీదు ఇమామ్ మౌలానా (ఆసిఫ్ అన్వర్), కమిటీ సభ్యులు అటావుల్లా, దన్నావల్లి, గౌస్, ఇర్ఫాన్, ఇబ్రహీం, మహ్మద్, రంజాన్, ఇమ్రాన్ సత్కరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, పార్టీ నాయకులు పెయ్యల రాజేష్, మత్సేటి శివ పాల్గొన్నారు.

రాజేంద్ర నగర్ మసీదులో..

రాజమహేంద్రవరం సిటీ: అల్లా దివ్య ఆశీస్సులు మానవాళి అందరిపైనా ఉండాలని ఎంపీ, సిటీ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ఆకాంక్షించారు. నగరంలోని రాజేంద్ర నగర్ బిలాల్ మసీదులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజంతా కఠోర ఉపవాసం చేయడం అనేది మహా యజ్ఞమే అన్నారు. మానవాళి మంచి కోసం రంజాన్ మాసంలో అల్లా చూపిన మార్గంలో ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో నడుచుకుంటూ మిగిలిన వారికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అల్లా చెప్పిన విధంగా తోటి వారిపై ప్రేమ, దయ, జాలి, కరుణ చూపిస్తూ, తోచిన సహాయ సహకారాలు చేయడం అన్నది ఆదర్శప్రాయ మార్గం అన్నారు. ఈ మంచి గుణం అందరిలోనూ ఉంటే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తుందన్నారు.

ఉపకరణాల పంపిణీ నిర్ధారణ శిబిరం

కంబాలచెరువు: ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోందని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దివ్యాంగులకు సమగ్ర శిక్షా, సహిత విద్య ఆధ్వర్యంలో ఉపకరణాల పంపిణీ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్, కడియం, అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన ప్రత్యేక అవసరాల పిల్లలు ఈ శిబిరానికి హాజరయ్యారు. డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మానసిక స్థైర్యాన్ని ఇవ్వాలన్నారు. భవిత కేంద్రాల్లో వారికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారానికి ఐదు రోజులు ఉడకబెట్టిన కోడిగుడ్లు, మూడు రోజులు వేరు శనగ చిక్కీ, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీవీబీఎన్ నారాయణ, ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ ఎస్.కనకబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసుదేవరావు

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలలోని పలు విభాగాల్లో నిష్ణాతులైన వారికి పురస్కారాలు అందజేయనున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు ఆదివారం తెలిపారు. కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, క్రీడాకారులకు వీటిని అందజేస్తామన్నారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 96523 47207 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కంబాలచెరువు: కోరుకొండ రోడ్డులోని బ్రదరన్ చర్చి వద్ద డివైడర్‌ను ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 30 ఏళ్లు) ఆదివారం రాత్రి మృతి చెందాడు. అతడు క్వారీ సెంటర్ నుంచి రాజమహేంద్రవరం వైపు వస్తుండగా మోటారు సైకిల్ అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలిసిన వెంటనే మూడో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. మృతుడి సెల్ ఫోన్ ఆధారంగా అతడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

నేటి నుంచి ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు

రంగంపేట: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో సోమవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ రబీ సీజన్‌లో మండలంలో 810 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేశారన్నారు. సాధారణ రకం(ముతకలు) 75 కేజీలు రూ.1,637, 100 కేజీలు రూ.2,183 మద్దతు ధరగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రస్తుతం వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయని, కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లన్నీ పూర్తి చేశామని చెప్పారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- గుమ్ములూరులో ఎన్నికల ప్రచారం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీకి శ్రీరామరక్ష అని ఆ పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. కోరుకొండ మండలం గుమ్ములూరులో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, భగవద్గీతలా భావించి, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు జరిపిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేశారన్నారు. ప్రజలను మోసం చేయడానికే బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి ఏర్పడిందన్నారు గతంలో 650 హామీలిచ్చిన చంద్రబాబు, వాటిని అమలు జరపకుండా మోసం చేశారన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, గ్రామ మాజీ సర్పంచ్ మట్టా పెద్ద వెంకటేశ్వర్లు, చీంద్రిం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



గుమ్ములూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

జోరుగా ఎన్నికల ప్రచారం

మధురపూడి: మండలంలోని బూరుగుపూడి, మునగాల, జంబూపట్నం, కోరుకొండ గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ కన్వీనర ఉల్లి బుజ్జిబాబు, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ, వైఎస్సార్ రైతు విభాగం జిల్లా కార్యదర్శి శ్రీను పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో అందరికీ మేలు



శాటిలైట్ సిటీలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి వేణుగోపాలకృష్ణ

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- పార్టీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ న్యాయం జరిగిందని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శాటిలైట్‌సిటీ గ్రామంలోని ఇందిరా నగర్‌లో పార్టీ నాయకుడు గొర్రెల రమణ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనల నుంచి 200 మంది ఆదివారం సాయంత్రం వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన రమ్యలక్ష్మి, జ్యోతి, దేవి, కరుణ, కృష్ణవేణి తదితరులకు మంత్రి వేణు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి వేణు మాట్లాడుతూ గ్రామాలలో రాజకీయాలకు అతీతంగా ప్రతి కుటుంబానికి అర్హతే ప్రమాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలను నేరుగా ఇంటివద్దకే అందించినట్లు తెలిపారు. జగన్ ప్రభుత్వంలో లబ్ధిపొందని కుటుంబం ఒక్కటి కూడా ఉండదన్నారు. అవినీతి రహిత పరిపాలన సాగించిన ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, శాటిలైట్‌సిటీ గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

బుచ్చయ్య నగర్‌లో..

పిడింగొయ్యి గ్రామ పంచాయతీ పరిధిలోని బుచ్చయ్య నగర్, బాపూజీనగర్, వెంకటగిరి ప్రాంతాల నుంచి వెంట్రపాటి చంటి ఆధ్వర్యంలో జనసేనకు చెందిన సుమారు 200 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. బుచ్చయ్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వేణు చేతుల మీదుగా వెంట్రపాటి సాంబశివరావు(చంటి), శియాద్రి శిరీష, తిగరకంటి వెంకటలక్ష్మి, గంధ్రోతు శివకుమార్, చిన్నబాబు, పిల్లి సందీప్, వీఎస్ కుమార్, కలిశెట్టి వెంకటేష్, మల్లెల నాగు, వేముల సత్తిబాబు, గట్టుబిల్లి సంజయ్, యల్లా దుర్గ తదితరులకు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు, పార్టీ నాయకుడు పడాల వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుకుంపేట డి బ్లాకులో పార్టీలో చేరిన వారితో నరేష్ తదితరులు

హుకుంపేట డి బ్లాకులో..

హుకుంపేట డిబ్లాకులో నేమాల సుశీల, నందిపర్తి లావణ్య ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి 100 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన నందిపర్తి లవకుశలు, వాసంశెట్టి విక్రమ్, తమ్మురాడ రవికుమార్, సంతోష్, చిట్టిబోయిన త్రిమూర్తులు తదితరులకు వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన నరేష్ పార్టీ కండువాలు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, పార్టీ నాయకులు తెలగరెడ్డి శ్రీనివాస్, షేక్ బాజీ, దుర్గాప్రసాద్, దత్తసాయి పాల్గొన్నారు.

జగన్ పాలనలో పారదర్శకంగా పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ
- ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కుల, మత, వర్గ, పార్టీ రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేశారని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. ఆమె ఆదివారం ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తన భర్త జక్కంపూడి రాజా, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఎన్నికల బరిలో ఉన్నారని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. ఐదేళ్ల మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరిగిందన్నారు. మహిళల సాధికారత కోసం జగన్ విశేషంగా కృషి చేశారని, మహిళల పేరిట అనేక సంక్షేమ పథకాలను అందించి వారి ఆర్థిక పురోగాభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. ఇలాంటి మంచి పథకాలు అమలు కావాలంటే మేలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, చల్లమళ్ల సుజీరాజు, సుంకవల్లి సుబ్రహ్మణ్యం, ఆళ్ల కోటేశ్వరరావు, సాదే చంటిబాబు, రుద్రం వీరేంద్ర, నిడదవోలు సుబ్బారావు, కూచిపూడి భాను, రుద్రం వెంకన్న, కూచిపూడి బాబ్జి, పెండ్యాల చౌదరి పాల్గొన్నారు.



ముగ్గళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

పలువురికి పరామర్శ

సీతానగరం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పలువురిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ ఆదివారం పరామర్శించారు. దివాన్ చెరువు, సీతానగరం, పురుషోత్తపట్నం, వెదుళ్లపల్లికి చెందిన పలువురు రాజమహేంద్రవరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వారందరినీ డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ పరామర్శించారు.